నమస్తే తెలంగాణ
# హైదరాబాద్
హైదరాబాద్- మేడ్చల్
11 | హైదరాబాద్, సోమవారం 12 ఫిబ్రవరి 2024 | HYDERABAD



## చలో నల్గొండ

*ఆదివారం కుత్బుల్లాపూర్ చింతల్ క్యాంపు కార్యాలయంలో 13న జరిగే చలో నల్గొండ సభకు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కేపీ వివేకానంద్* - కుత్బుల్లాపూర్



# మరో మూడు ఎస్టీపీలు

- మిరాలం.. నల్లచెరువు..పెద్దచెరువు ఎస్టీపీలు ప్రారంభానికి సిద్ధం
- అధునాతన టెక్నాలజీతో నిర్మాణం
- ఒకే చాంబర్‌లో ఐదు స్టేజీల మురుగునీటి శుద్ధి

సిటీబ్యూరో, ఫిబ్రవరి 11 (నమస్తే తెలంగాణ): హైదరాబాద్ నగరంలో వందకు వంద శాతం మురుగునీటి శుద్ధి చేసే లక్ష్యంలో మరో మూడు ఎస్టీపీలు అందుబాటులోకి తెచ్చేందుకు జలమండలి ఏర్పాట్లు చేస్తున్నది. మూడు ప్యాకేజీల్లో రూ.3866.41 కోట్ల వ్యయంతో నిర్మిస్తున్న 31 ఎస్టీపీల పనుల్లో కోకాపేట, దుర్గం చెరువు ఎస్టీపీలను అందుబాటులోకి తీసుకువచ్చారు. అంబర్‌పేట (212.50 ఎంఎల్‌డీలు), నల్లచెరువు (86.50 ఎంఎల్‌డీ), పెద్ద చెరువు (17.5 ఎంఎల్‌డీలు), సఫిల్‌గూడ (5.50 ఎంఎల్‌డీలు), మిరాలం (41.50 ఎంఎల్‌డీలు), నాగోల్ (320 ఎంఎల్‌డీలు), ఫతేనగర్ (133 ఎంఎల్‌డీలు), ఖాజాకుంట (20 ఎంఎల్‌డీలు), వెన్నెలగడ్డ (10 ఎంఎల్‌డీలు), మియాపూర్ పటేల్ చెరువు (7 ఎంఎల్‌డీలు) ఎస్టీపీ పనులు తుది దశకు చేరుకున్నాయి. రెండు షిప్టుల్లో పనిచేస్తూ పనులు వేగంగా చేస్తున్నారు. రాత్రివేళల్లో పనులు చేసేందుకు వీలుగా లైటింగ్ ఏర్పాటు చేశారు. సివిల్ పనులు పూర్తయిన ఎస్టీపీల్లో ఎలక్ట్రో మెకానిక్ సామగ్రి బిగింపు పనులు చేపడుతున్నారు. వీటితో పాటు సుందరీకరణకు గార్డెనింగ్, ల్యాండ్‌స్కేప్ పనులు ముమ్మరం చేశారు. ఇందులో భాగంగానే మిరాలం, నల్లచెరువు, పెద్ద చెరువు ఎస్టీపీలను వచ్చే వారంలోగా ప్రారంభించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. అధునాతన సీక్వెన్సింగ్ బ్యాచ్ రియాక్టర్ టెక్నాలజీతో కొత్త ఎస్టీపీల నిర్మాణం జరుగుతున్నది. మెట్రో నగరాల్లో స్థలాభావం ఉంటుంది కాబట్టి ఎస్‌బీఆర్ టెక్నాలజీతో నిర్మాణం అనువుగా ఉంటుంది. వీటి వల్ల ఒకే చాంబర్‌లో ఐదు స్టేజీల మురుగునీటి శుద్ధి ప్రక్రియ జరిగి.. తక్కువ విస్తీర్ణంలో ఎక్కువ నీటిని శుద్ధి చేస్తాయి. దేశంలో వినియోగిస్తున్న వివిధ బయోలాజికల్ ట్రీట్ మెంట్ పద్ధతుల కంటే ఈ ఎస్‌బీఆర్ విధానానికి తక్కువ ఖర్చు అవడంతో పాటు మెరుగ్గా మురుగునీటి శుద్ధి జరుగుతుంది. ఇది తేలికైన విధానం. దీనికి విద్యుత్ వినియోగం కూడా తక్కువగా ఉంటుంది.



## ప్రతి డివిజన్‌కు 2 లక్షల క్రీడా సామగ్రి


సిటీబ్యూరో, ఫిబ్రవరి 11 (నమస్తే తెలంగాణ) : క్రీడాభివృద్ధికి జీహెచ్ఎంసీ పెద్ద పీట వేస్తున్నది. ఆటలను ప్రోత్సహించేలా ప్రతి ఏటా తరహాలోనే ఈ వేసవిలోనూ చిన్నారులకు క్రీడా నైపుణ్యాన్ని పెంపొందించి.. నిష్ణాతులైన క్రీడాకారులుగా తయారు చేసేందుకు సమ్మర్ కోచింగ్ క్యాంపు -2024కు ఏర్పాట్లు చేస్తున్నది. ఏప్రిల్ 25 నుంచి జూన్ మొదటి వారం వరకు నిర్వహించాలని భావిస్తున్నారు. ఈ సమ్మర్ కోచింగ్ క్యాంపుల్లో 6 నుంచి 16 సంవత్సరాల వయస్సు గల చిన్నారులకు వివిధ క్రీడలపై శిక్షణ ఇవ్వనున్నారు. ప్రతి డివిజన్‌కు రెండు లక్షల చొప్పున క్రీడా సామగ్రిని వచ్చే నెల రెండో వారం లోగా అందజేయనున్నారు.

# డయల్ 100

నాడు 8 నిమిషాల్లో.. నేడు గంటలు.. రోజులు

రాచకొండ కమిషనరేట్ పరిధిలో మరింత అధ్వానం

# రెస్పాన్స్ ఢమాల్..




సిటీబ్యూరో, ఫిబ్రవరి 11 (నమస్తే తెలంగాణ): డయల్ 100కు కాల్ చేస్తే.. 5 నుంచి 8 నిమిషాల వ్యవధిలోనే ఘటనా స్థలికి చేరుకొనే పోలీసులు.. నేడు గంటలు, రోజులైనా.. చేరుకోలేని పరిస్థితి ఉన్నదన్న విమర్శలు వస్తున్నాయి. రాచకొండ కమిషనరేట్ పరిధిలో ఈ పరిస్థితి మరింత అధ్వానంగా ఉన్నది. పోలీసు సేవలు ప్రజలకు వేగంగా అందించేందుకు గత కేసీఆర్ ప్రభుత్వం డయల్ 100 సేవలను వేగవంతం చేసింది. (అత్యవసర సేవలకు జాతీయ స్థాయిలో 112 అందుబాటులోకి తేగా.. డయల్ 100కు కాల్ చేసినా.. అదే నంబర్‌కు వెళ్తుంది). బాధితులు డయల్ 100కు ఫోన్ చేయగానే.. అక్కడి నుంచి నేరుగా పోలీస్‌స్టేషన్‌లోని ఆయా సెక్టార్లలో ఉండే పెట్రోలింగ్ సిబ్బందికి ఆ సమాచారం వెళ్లడం..వెంటనే ఆ పెట్రోలింగ్ సిబ్బంది అక్కడకు చేరుకునే పటిష్టమైన వ్యవస్థను రూపొందించారు. ఒక కాల్ వచ్చిందంటే.. ఎంత సేపట్లో పెట్రోలింగ్ సిబ్బంది ఘటనాస్థలికి వెళ్లారనే పర్యవేక్షణ కొనసాగేది. ఆ సమస్య పరిష్కారమైందంటూ.. తిరిగి బాధితులకు కూడా సమాచారం ఇచ్చే వాళ్లు. ఇలా వేగవంతంగా, కచ్చితమైన సమయంలో డయల్ 100 సేవలు కొనసాగుతూ వచ్చాయి. అయితే నేడు పరిస్థితి పూర్తిగా మారింది. 10 నిమిషాల్లోపు రావడం అనేది ఇప్పుడు అసాధ్యంగా మారింది. గంటల కాదు ఏకంగా కొన్ని సందర్భాల్లో రోజుల సమయం కూడా తీసుకుంటున్నారంటే.. సిబ్బంది ఎంత నిర్లక్ష్యంగా ఉన్నారో అర్థమవుతున్నది.

### కొన్ని ఉదంతాలివి..

- సరూర్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో 9వ తేదీ రాత్రి 11.30 గంటల ప్రాంతంలో డయల్ 100కు కొందరు ఫోన్ చేశారు. కర్మన్‌ఘాట్‌లో సౌండ్ పొల్యూషన్ వస్తున్నదని, పక్కన పెద్ద పెద్ద శబ్దాలతో శ్లాబ్‌లు వేస్తున్నారని, మేం నిద్రలేకుండా ఉన్నామం'టూ.. డయల్ 100కు ఫోన్ చేసి బాధలు చెప్పారు. ఫోన్ చేసిన వారికి మీరు డయల్ డయల్ 112(100) కాల్ చేశారు.. మీ సమస్యను సరూర్‌నగర్ పోలీస్‌స్టేషన్‌కు కేటాయించాం.. సంబంధిత అధికారి మిమ్మల్ని కాంటాక్టు చేస్తారంటూ..సందేశం కూడా వచ్చింది. గంటకు కూడా ఎవరి నుంచి ఫోన్ రాకపోడంతో మరోసారి ఫోన్ చేశారు. ఒక్కొక్కరూ రెండు మూడు సార్లు ఫోన్ చేసినా.. సంబంధం లేదన్నారు. దీంతో ఇంటర్‌నెట్‌లో స్థానిక మొబైల్ నంబర్‌కు, పోలీస్‌స్టేషన్‌కు ఫోన్ చేశారు. వేరే కేసులో ఉన్నామంటూ చెప్పారు. అయితే మరో గంట తరువాత కూడా ఎవరూ అక్కడకు రాలేదు. తీరా డయల్ 100కు ఫోన్లు కొడుతుండడంతో చివరకు రాత్రి 1.30 గంటలకు పెట్రోలింగ్ పోలీసులు ఫోన్ చేసి వచ్చారు. భవన నిర్మాణ పనులు నడుస్తుండడంతో పెట్రోలింగ్ సిబ్బంది వచ్చి..వాటిని ఆపేయాలని శబ్ధం వస్తుందంటూ వారికి సూచన చేసి, ఫిర్యాదు చేసిన వారిని పంపించేశారు. తరువాత మళ్లీ అక్కడ శబ్ధ కాలుష్యం కొనసాగింది. అయితే పోలీసులకు ఫోన్ చేయడం వృథా అనుకొని తరువాత పోలీసులను ఎవరూ సంప్రదించలేదు.
- ఈ నెల 7న రాత్రి మీర్‌పేట్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని సప్తగిరి కాలనీలో ఒక ఇంట్లో దొంగతనం జరిగింది. రాత్రి 9 గంటల ప్రాంతంలో డయల్ 100కు బాధితులు ఫోన్ చేసి దొంగతనం జరిగిందంటూ చెప్పారు. ఫోన్ చేసిన తరువాత గంటలు గడుస్తున్నా ఎవరూ రాలేదు. కొన్ని గంటల తరువాత పోలీసులు ఫోన్ చేశారు. మేం వస్తున్నామంటూ చెప్పారు. అయితే 9వ తేదీ ఉదయం 11 గంటల ప్రాంతంలో ఘటనా స్థలానికి వెళ్లారు. అయితే 7 వ తేదీ రాత్రి డయల్ 100కు ఫోన్ చేసిన వారి ఇంట్లో వి ద్యుత్ సామగ్రి దొంగతనం కాగా, అదే ప్రాంతంలో మరో ఇంట్లో ల్యాప్‌టాప్‌ల చోరీ జరిగింది. పోలీసులు ఆ సమయంలో ఆ ప్రాంతంలో పెట్రోలింగ్ చేసి.. ఉంటే రెండో దొంగతనం జరిగేది కాదని స్థానికులు వాపోతున్నారు.
- దొంగతనాలు జరుగుతున్నాయని కాలనీలో అనుమానాస్పద వ్యక్తులు కొత్తవాళ్లు తిరుగుతున్నారంటూ.. మారుతీనగర్‌కు చెందిన ఒక కాలనీ ప్రతినిధి డయల్ 100కు 10వ తేదీ రాత్రి 8 గంటల ప్రాంతంలో సమాచారం ఇచ్చాడు. అయితే మరుసటి రోజు వరకు కూడా అక్కడికి పోలీసులు వెళ్లలేదు. కనీసం ఫోన్ చేసి ఏమి జరిగిందని అడిగిన వాళ్లు లేరు.

### స్పందన లేకుంటే.. అంతే..

డయల్ 100కు ఫోన్ చేయడంతో వెంటనే పోలీసులు వస్తారనే భరోసా ప్రజల్లో ఉన్నది. అయితే స్థానికంగా ఉండే పెట్రోలింగ్, క్షేత్ర స్థాయి సిబ్బంది నిర్లక్ష్యం కారణంగా ఇలా జాప్యం జరుగుతున్నదని కొందరు అధికారులు పేర్కొంటున్నారు. వేరే పనిలో ఉండి.. డయల్ 100కు ఆలస్యంగా రావడం అనేది పది ఇరవై నిమిషాలుంటుంది. అలా కాకుండా గంటలు, రోజులు మాత్రం గతంలో ఎప్పుడు లేవు. ప్రతి కాల్‌కు స్పందన, రెస్పాన్స్ సమయం కచ్చితంగా నిర్వహించేవారు. కొన్ని సందర్భాల్లో స్థానికంగా ఉండే పెట్రోలింగ్ సిబ్బందికి ఆయా వ్యాపార కేంద్రాల నిర్వాహకులతో సంబంధాలుంటాయి. ఆ ప్రాంతం నుంచి ఎవరైనా ఫిర్యాదు చేశారంటే కూడా పట్టించుకోరు. మరికొన్ని సందర్భాల్లో సమస్యను పరిష్కరించినట్లే చేస్తూ, ఆ తరువాత ఆరోపణలు ఎదుర్కొనే వారితో కొంత డబ్బు తీసుకొని తూతూ మంత్రంగా సమస్య పరిష్కరించినట్లు చేసి.. అక్కడి నుంచి వెళ్లిపోతుంటారు. ఇలా కొందరు ఉద్దేశపూర్వకంగా కూడా డయల్ 100 సేవల్లో కాలాయపన చేస్తుంటారని కొందరు అధికారులు పేర్కొంటున్నారు.



## టీచ్ ఫర్ చేంజ్

*మాదాపూర్‌లోని హెచ్ఐసీసీలో ప్రముఖ సినీ నటి మంచు లక్ష్మి ఆధ్వర్యంలో ఆదివారం టీచ్ ఫర్ చేంజ్ ఫ్యాషన్ షో నిర్వహించారు. పేద విద్యార్థుల విద్య కోసం నిధుల సమీకరణే ముఖ్య ఉద్దేశంగా నిర్వహించిన ఈ వెంట్‌లో నటీనటులు ర్యాంప్ వాక్ చేయగా, అందాల తార శ్రేయ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.*

- మాదాపూర్, ఫిబ్రవరి 11

## డిప్యూటీ మేయర్‌గా మూడేండ్లు.. శుభాకాంక్షలు

సికింద్రాబాద్, ఫిబ్రవరి 11: నగర డిప్యూటీ మేయర్‌గా మూడేండ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా మోతె శ్రీలతాశోభన్‌రెడ్డికి బీఆర్ఎస్ కార్పొరేటర్లతో పాటు పలువురు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా డిప్యూటీ మేయర్ తనను ప్రోత్సహించిన బీఆర్ఎస్ అధినేత కేసీఆర్, వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు, సహకరించిన మేయర్ గద్వాల్ విజయలక్ష్మికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. తనకు అన్ని విధాలా సహకరించిన ప్రతి ఒక్కరికీ, నగర ప్రజలకు తాను ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానన్నారు. అలాగే కొత్త ప్రభుత్వానికి అని విధాలా సహకరిస్తానన్నారు.

## మృణాల్.. మనసు దోచెన్

*జూబ్లీహిల్స్ రోడ్ నం. 10లో జరిగిన ఫ్యాషన్ ఈవెంట్ కలర్ ఫుల్‌గా సాగింది. మోడళ్లతో పాటు నటి మృణాల్ ఠాకూర్ ర్యాంప్ వాక్‌తో అదరగొట్టింది.*



# టీఎస్‌నాబ్‌ను పట్టించుకోవట్లే

సిబ్బంది కొరత.. మౌలిక వసతులు కరువు

కార్యాలయాలు.. వాహనాలు లేక ఇబ్బందులు

సిటీబ్యూరో, ఫిబ్రవరి 11 (నమస్తే తెలంగాణ): డ్రగ్స్ రహిత రాష్ట్రంగా తెలంగాణను తీర్చిదిద్దాలని గత కేసీఆర్ ప్రభుత్వం ఏర్పాటు చేసిన టీఎస్‌నాబ్(తెలంగాణ స్టేట్ యాంటీ నార్కొటిక్ బ్యూరో)నేడు సిబ్బంది కొరతతో పాటు మౌలిక సదుపాయాలు లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నది. డ్రగ్స్ దందాను ఉక్కుపాదంతో అణచివేస్తామంటూ ప్రభుత్వం ఒక వైపు చెబుతున్నా..అందుకు కావాల్సిన వనరులను సమకూర్చడంలో ఏ మాత్రం పట్టించుకోవడం లేదనే విమర్శలు వస్తున్నాయి. హైదరాబాద్, సైబరాబాద్, రాచకొండ, వరంగల్‌లో నాలుగు నార్కొటిక్ పోలీస్‌స్టేషన్లు, 7 రీజినల్ నార్కొటిక్ కంట్రోల్ సెల్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్‌ను ఏర్పాటు చేయడం, హెడ్ ఆఫీస్ నుంచి ఇన్వెస్టిగేషన్, మానిటరింగ్, లీగల్, డాక్యుమెంటేషన్, అవేర్‌నెస్, అడ్మినిస్ట్రేషన్, లాజిస్టిక్, టెక్నికల్, స్టేట్ టాస్క్‌ఫోర్స్, డేటా అనాలసిస్, సోషల్ మీడియా, డార్క్‌నెట్, ఫైనాన్షియల్ అనాలటిక్స్, అఫెండర్స్ మానిటరింగ్, కంట్రోల్ రూమ్ తదితర విభాగాలతో పాటు అందుకు తగ్గట్టు సిబ్బందిని నియమించాలి. కానీ టీఎస్‌నాబ్‌కు పూరిస్థాయిలో కనీస సౌకర్యాలు లేకపోవడంతో పాటు ప్రస్తుతం ఉన్న సిబ్బందికి వాహనాలు, కూర్చునేందుకు కార్యాలయాలు కూడా లేవంటూ సిబ్బంది ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

# దారి విషయంలో తగాదా

అన్నపై తమ్ముడి ఘాతుకం

పెట్రోల్ పోసి.. నిప్పంటించిన వైనం

కంటోన్మెంట్, ఫిబ్రవరి 11: ఇండ్ల మధ్య ఉన్న దారి విషయమై తగాదాతో అన్నపై పెట్రోల్ పోసి నిప్పంటించాడు తమ్ముడు. ఈ దారుణం బోయిన్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. బేగంపేట ఏసీపీ రామలింగ రాజు, బోయిన్‌పల్లి ఇన్‌స్పెక్టర్ లక్ష్మీనారాయణ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. బోయిన్‌పల్లి కంసారి బజార్ రామమందిరం వీధిలోని మహంకాళి ఆలయం ముందు అన్నదమ్ములు శ్రీనివాస్, వినోద్‌కు సంబంధించిన స్థలం ఉంది. శ్రీనివాస్ (62) మొబైల్ రీచార్జ్ సెంటర్ నడిపిస్తూ.. జీవనం సాగిస్తున్నాడు. తన భవనాన్ని అద్దెకు ఇచ్చి బోయిన్‌పల్లిలోని మరో ఇంటిలో నివాసముంటున్నాడు. తమ్ముడు వినోద్ (42) ఎలక్ట్రిసిటీ శాఖలో కాంట్రాక్టు లేబర్‌గా పనిచేస్తున్నాడు. మద్యానికి బానిసయ్యాడు. శ్రీనివాస్, వినోద్ ఇండ్ల మధ్య దారి ఉంది. శ్రీనివాస్ తన ఇంటికి వెళ్లాలంటే.. ఇదే దారి మీదుగా వెళ్లాల్సి ఉంటుంది. అయితే ఈ దారిలో వినోద్ ఓ బాత్రూం నిర్మించాలని అనుకున్నాడు. అన్న శ్రీనివాస్ రానూపోనూ దారి ఉండదని వారిస్తూ వస్తున్నాడు. దీంతో కొంత కాలంగా ఇద్దరి మధ్య గొడవలు జరుగుతున్నాయి. ఇటీవల వారి కుటుంబసభ్యుల మధ్య రాజీ కుదిర్చే ప్రయత్నాలు జరిగాయి. కానీ సమస్యకు పరిష్కారం దొరకలేదు. దీంతో అన్నపై కక్ష పెంచుకున్న వినోద్.. ఆదివారం ఉదయం మద్యం తాగి.. పథకం ప్రకారం తన ఇంటిలో ఓ డబ్బాలో 3 లీటర్ల పెట్రోలును నిల్వ ఉంచాడు. సాయంత్రం అన్న శ్రీనివాస్ తన ఇంటి అద్దె వసూలు చేసుకొని.. వెళ్తున్న సమయంలో వెనుక నుంచి పెట్రోల్ పోసి నిప్పంటించి పారిపోయాడు. గమనించిన స్థానికులు మంటలను ఆర్పివేసి 108 అంబులెన్స్‌లో గాంధీ వైద్యశాలకు తరలించారు. స్థానికుల సమాచారం మేరకు ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.





పుస్తకం.. నిజమైన నేస్తం
BOOK Fair 2024

# బుక్ ఫెయిర్.. ఎంతో హుషార్

- ఆదివారం భారీగా తరలొచ్చిన సందర్శకులు
- అలరించిన చిన్నారుల నృత్య ప్రదర్శన
- ఆలోచింపజేసిన బాలసాహిత్యం చర్చలు

సిటీబ్యూరో, ఫిబ్రవరి 11 ( నమస్తే తెలంగాణ) : చిరిగిన చొక్కా అయినా తొడుక్కో..కానీ ఓ మంచి పుస్తకం కొనుక్కో' అని కందుకూరి వీరేశలింగం పంతులు చెప్పిన మాట. పుస్తకం ఎంత విలువైనదో ఈ వ్యాఖ్యం వెల్లడిస్తుంది. అందుకే పుస్తకాలను చదవడం అలవాటు చేసుకుంటే విజయ తీరాల వైపునకు బాటలు వేసుకున్నట్టేనని నిపుణులు చెబుతున్నారు. పుస్తకం ఆనందాన్నిస్తుంది. అలవాట్లను మారుస్తుంది. మంచి స్నేహితుడిలా జీవితానికి మార్గనిర్దేశం చేస్తుంది. తరాల మధ్య వారధి వేస్తుంది. వ్యక్తిత్వాలను తీర్చిదిద్దుతుంది. ఎంతో కష్టపడి వివిధ రంగాల్లో పైకి వచ్చిన వారంతా పుస్తకానికి ప్రథమ ప్రాధాన్యతనిచ్చినవాళ్లేననే విషయం మరువకూడదు. అందుకే పుస్తక పఠనం అందరి దినచర్యల్లో భాగం కావాలని హైదరాబాద్ బుక్ ఫెయిర్ చాటుతున్నది. ఎన్టీఆర్ స్టేడియంలో కొలువుదీరిన హైదరాబాద్ జాతీయ పుస్తక ప్రదర్శనకు ఆదివారం భారీగా పుస్తక ప్రేమికులు తరలివచ్చారు. పుస్తక విలువను చాటడంలో రాష్ట్ర వ్యాప్తంగా విద్యార్థుల నుంచి మొదలు కొని సీనియర్ సిటిజన్స్ వరకు ఫెయిర్‌కు వచ్చి..నచ్చిన పుస్తకాలను కొనుగోలు చేశారు. సాహిత్యం, కథలు, క్రైమ్, పాలిటిక్స్, విదేశీ సంబంధాలు, వైల్డ్ లైఫ్, ఫొటోగ్రఫీ, ఎన్‌సైక్లోపీడియా, రొమాన్స్, ఫాంటసీ, రిలీజియన్ అండ్ సైన్స్, కుకింగ్, బయోగ్రఫిక్, చిల్డ్రన్, నాన్ ఫిక్షన్ తదితర వాటికి సంబంధించిన అన్ని పుస్తకాలు అందుబాటులో ఉండటంతో నగరవాసులు కొనుగోలు చేశారు.

### బాలసాహిత్యంపై..

రవ్వా శ్రీహరి వేదికపై బాలసాహిత్యంపై చర్చోపచర్చలు జరిగాయి. ముఖ్య అతిథిగా పాల్గొన్న మణికొండ వేద కుమార్ మాట్లాడుతూ.. పిల్లల్లో సృజనాత్మకత పెంపొందడానికి పుస్తక పఠనం ఉపయోగపడుతుందని వివరించారు. పిల్లలకు సంబంధించిన రచనలు మరిన్ని రావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఆదిలాబాద్‌కు చెందిన యాపల్ గూడ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలకు చెందిన 18 మంది విద్యార్థులు ఆంగ్లంలో రాసిన కథల పుస్తకం 'ద స్టోరీస్ ఆఫ్ యాపల్ గుడా చిల్డ్రన్' పుస్తకాన్నీ బాలసాహితీ వేత్తలు వీఆర్ శర్మ ఆవిష్కరించారు.

### రవ్వా శ్రీహరి వేదికపై..

ఫ్యాన్సీ డ్రెస్ పోటీలు, షాడో ప్లే కార్యక్రమాలు జరిగాయి. పిల్లలు అధిక సంఖ్యలో పాల్గొని సందడి చేశారు. విభిన్న రకాల డిజైన్లతో కూడిన దుస్తులు ధరించి వాక్‌తో అలరించారు. అనంతరం సాయంత్రం జరిగిన కార్యక్రమంలో అమృతా ప్రీతమ్ రచించిన 'పంజరం' పుస్తకావిష్కరణ జరిగింది. స్త్రీ హక్కులను ప్రోత్సహించడంలో భాగంగా ఈ పుస్తకం ఉన్నదని వక్తలు తెలిపారు. అనంతరం రచయిత కృష్ణ రచించిన హార్మ్‌లెస్ క్రిమినల్స్ పుస్తకాన్ని ఆవిష్కరించారు. అనంతరం భాగ్యలక్ష్మి డ్యాన్స్ స్కూల్ విద్యార్థుల నృత్య ప్రదర్శన సభికులను అలరించింది.



బుక్‌ఫెయిర్‌లో బొగ్గరవ్వలు పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న అతిథులు